05ATP14_05ATP14.qxd 14-06-2025 PM 11:56 Page 1



## వివాహ వేడుకకు హాజరైన ఎమ్మెల్యే జె.సి



వేడుకలో పాల్గొన్న ఎమ్మెల్యే జె.సి

తాడిపత్రిటౌన్, జూన్ 14 ప్రభాతవార్త

తాడిపత్రి పట్టణ సమీపంలోని అనంతపురం రోడ్డులో వున్న బొజ్జయ్య కళ్యాణమండపంలో శనివారం జరిగిన వివాహ వేడుకకు ఎమ్మెల్యే జె.సి అశ్మిత్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన నూతన వధూవరులను ఆశీర్వదించి వారికి శుభాకాంక్షలు తెలియచేశారు. ఆయన వెంట పలువురు టిడిపి నాయకులు, కార్యకర్తలు వున్నారు.

## ఫ్రెండ్స్ సహారా సొసైటీ సేవలకు బెస్ట్ పురస్కారం




బెస్ట్ పురస్కారం అందుకుంటున్న దృశ్యం

తాడిపత్రిటౌన్, జూన్ 14 ప్రభాతవార్త

కార్ల్ ల్యాండ్ స్టేయినర్ పుట్టినరోజు పురస్కరించుకొని ప్రపంచ రక్తదాతల దినోత్సవ సందర్భంగా తాడిపత్రిలో ఫ్రెండ్స్ సహారా సొసైటీ సభ్యులు మూడు సంవత్సరాల నుండి చేసినటువంటి సేవ, బ్లడ్ డొనేషన్ కార్యక్రమాలను గుర్తించి అనంతపురం ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో అనంతపురం ఆర్డీఓ గుత్తా కేశవనాయుడు, అసిస్టెంట్ కమీషనర్, సెంట్రల్ జీఎస్‌టి విభాగం సుందరరాజు, ఐఆర్‌సిఎస్ చైర్‌పర్సన్ కాపు భారతిల చేతులమీదుగా ఫ్రెండ్స్ సహారా సొసైటీ సభ్యులకు బెస్ట్ పురస్కారాన్ని అందచేశారు. అనంతరం ఫ్రెండ్స్ సహారా సొసైటీ సభ్యులు మాట్లాడుతూ ఫ్రెండ్స్ సహారా సొసైటీ సంస్థకు రెండవసారి బెస్ట్ పురస్కారం లభించినందుకు ఫ్రెండ్స్ సహారా సొసైటీ సభ్యులు సంతోషం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలను చేపడతామని పేర్కొన్నారు. అలాగే సేవా కార్యక్రమాలకి సహకరిస్తున్న మిత్రులు మరియు రక్తదాతలకు పేరుపేరునా ప్రత్యేక ధన్యవాదాలు తెలియచేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు, తాడిపత్రి ఫ్రెండ్స్ సహారా సొసైటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా రమేష్‌రెడ్డి జన్మదిన వేడుకలు



రమేష్‌రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న దృశ్యం

తాడిపత్రిటౌన్, జూన్ 14 ప్రభాతవార్త

పట్టణంలో శనివారం వైకాపా రాష్ట్ర కార్యదర్శి కొనదుల రమేష్‌రెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. రమేష్‌రెడ్డి నివాసంలో ఆయన అభిమానుల నడుమ కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. శుక్రవారం అర్ధరాత్రే అభిమానులు బాణాసంచి పేల్చి కేరింతల మధ్య సంబరాలు జరుపుకున్నారు. అనంతరం రమేష్‌రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

## కన్నులపండువగా శ్రీరంగనాథస్వామి కళ్యాణోత్సవం

తాడిపత్రిరూరల్, జూన్ 14 ప్రభాతవార్త



శ్రీదేవి, భూదేవి సమేత శ్రీరంగనాథస్వామి కళ్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

మండలంలోని ఆలూరు కోనలో వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీరంగనాథ స్వామి కళ్యాణోత్సవం శనివారం కన్నులపండువగా జరిగింది. హైదరాబాద్‌కు చెందిన రంగస్వామి కుటుంబసభ్యులు స్వామివారి కళ్యాణోత్సవాన్ని జరిపించారు. ఇందులో భాగంగా స్వామివారి ఉత్సవ విగ్రహాలను పట్టువస్త్రాలు, వివిధ రకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం మంగళవాయిద్యాల నడుమ, సుగంధపుష్పాలతో శాస్త్రోక్తంగా వేదపండితులు సుబ్బారావు, రంగనాథశర్మలు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీరంగనాథస్వామి వారి కళ్యాణోత్సవాన్ని కన్నులపండువగా నిర్వహించారు. పెద్దఎత్తున భక్తులు హాజరై స్వామివారి కళ్యాణాన్ని వీక్షించారు. గోవిందనామస్మరణతో ఆలయం మారుమ్రోగింది. హాజరైన భక్తులు నిత్యాన్నదాన సత్రంలో భోజనాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఇఒ రామాంజనేయులు, సిబ్బంది కాశీ, భక్తులు పాల్గొన్నారు.

## పాదయాత్రకు సంఘీభావం



పాదయాత్రలో పాల్గొన్న వైకాపా జిల్లా ఉపాధ్యక్షురాలు లక్ష్మీదేవి

యాడికి, జూన్ 14 ప్రభాతవార్త

రూరల్ డెవలప్మెంట్ ట్రస్ట్ (ఆర్డీటి) సంస్థ సేవలు కొనసాగేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తగు చర్యలు తీసుకోవాలని కోరుతూ అనంతపురం మాజీ ఎంపి తలారి రంగయ్య కళ్యాణదుర్గంలో చేపట్టిన పాదయాత్రకు వైకాపా జిల్లా మహిళా ఉపాధ్యక్షురాలు లక్ష్మీదేవి సంఘీభావాన్ని తెలిపారు. కళ్యాణదుర్గం కదరగుట్ట గ్రామంలో నిర్వహిస్తున్న పాదయాత్రలో లక్ష్మీదేవి పాల్గొని తన సంఘీభావాన్ని తెలుపుతూ పాదయాత్రలో కొనసాగారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అనంతపురం జిల్లా కరువుకు మారుపేరని, ఇలాంటి కరువు జిల్లాలో ఆర్డీటి సంస్థను ప్రారంభించిన విన్సెంట్ ఫెర్రర్ జిల్లాలోని పేద బడుగు బలహీన వర్గాల వారికి అన్ని రంగాల్లో అభివృద్ధి చెందేలా ఆర్థిక సహాయ సహకారాలు అందించిన విధానం గురించి ఆమె వివరించారు. ఈ సంస్థ ద్వారా ఎందరో మహానుభావులు డాక్టర్లు గాను ఇంజనీర్లు గాను సామాజిక సేవా కార్యకర్తలుగాను పేరు ప్రఖ్యాతలు గాంచారని, అలాంటి సంస్థను, సంస్థ సేవలను కొనసాగేలా ప్రభుత్వం తగు చర్యలు చేపట్టాలని ఆమె ఈ సందర్భంగా విలేకరులతో తెలిపారు.

## యువత రక్తదానంలో కీలక పాత్ర పోషించాలి

- ఎమ్మెల్యే కందికుంట



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కందికుంట

కదిరి, జూన్ 14 ప్రభాతవార్త

యువత రక్తదానంలో కీలక పాత్ర పోషించాలని ఎమ్మెల్యే కందికుంట పిలుపునిచ్చారు. శనివారం ప్రపంచ రక్తదాన దినోత్సవం సందర్భంగా స్థానిక ఏరియా ప్రభుత్వ ఆసుపత్రిలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ పాల్గొన్నారు. అత్యధిక సార్లు రక్తదానం చేసిన రక్తదాతలకు, ఆర్గనైజర్లకు ప్రశంసా పత్రాలు అందించి ఎమ్మెల్యే అభినందించారు. అత్యవసర పరిస్థితుల్లో రక్తదానం చేస్తున్న ప్రతి ఒక్క రక్తదాతకు పేరుపేరునా అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డిఓ వివిఎస్ శర్మ, మున్సిపల్ కమిషనర్ కిరణ్‌కుమార్, ఏరియా ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్, వైద్యులు, కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

## యోగాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్న కమలమ్మ

తాడిపత్రిటౌన్, జూన్ 14 ప్రభాతవార్త



జ్యోతిప్రజ్వలన చేస్తున్న కమలమ్మ

జిల్లా కేంద్రంలోని పిటిసి మైదానంలో శనివారం నిర్వహించిన యోగాంధ్ర కార్యక్రమంలో తాడిపత్రికి చెందిన మాల కార్పోరేషన్ రాష్ట్ర డైరెక్టర్ కమలమ్మ పాల్గొన్నారు. 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు శనివారం జిల్లా కేంద్రంలో దివ్యాంగులకు యోగాంధ్ర కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్, అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్‌తో పాటు కమలమ్మ పాల్గొన్నారు.

## అన్న చేతిలో తమ్ముడు హతం

- ఇంటిలో సగ భాగం కావాలని అడిగినందుకు హత్య




హత్యకు గురైన చిన్నకంబగిరి, చిన్నకంబగిరి (ఫైల్‌ఫోటో)

పుట్లూరు, జూన్ 14 ప్రభాతవార్త

ఇంటిలో సగ భాగం కావాలని అడిగినందుకు తమ్ముడు చిన్న కంబగిరిపై అన్న పెద్ద కంబగిరి కిరాతకంగా కొడవలితో నరికి హత్య చేసిన ఘటన పుట్లూరు మండల కేంద్రంలో చోటు చేసుకొంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు మండల కేంద్రానికి చెందిన పెద్ద కంబగిరి, చిన్న కంబగిరి సొంత అన్నదమ్ములు. అయితే పెద్ద కంబగిరి సొంత ఖర్చులతో ఇల్లు నిర్మించాడని, అందులో సగ భాగం తనకు ఇవ్వకపోతే నిన్ను చంపుతానని చిన్నకంబగిరి తన అన్నను బెదిరించడంతో రాత్రి ఇంటిలో నిద్రిస్తున్న సమయంలో తమ్ముడు చిన్నకంబగిరిని అన్న పెద్దక్కంబగిరి వేట కొడవలితో నరికి హత్య చేశాడన్నారు. సంఘటనా స్థలానికి పోలీసులు చేరుకొని పరిశీలించారు. తల్లి ఓబుళమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకటనరసింహ తెలిపారు.

## ఎస్ఎస్‌బిఎన్‌లో యోగాంధ్ర ఉత్సవాల సందర్భంగా ప్రత్యేక యోగా కార్యక్రమ నిర్వహణ



యోగా నిర్వహిస్తున్న దృశ్యం

అనంతపురం న్యూటౌన్, జూన్ 14 ప్రభాతవార్త

రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న యోగాంధ్ర ఉత్సవాలు సందర్భంగా, శ్రీ సాయి బాబా నేషనల్ డిగ్రీ కళాశాలలో జూన్ 14, 2025 (శనివారం)న ఉదయం 6:30 నుండి 7:30 వరకు కళాశాల బాస్కెట్ బాల్ స్టేడియంలో ప్రత్యేక యోగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, అధ్యాపకులు, విభాగ సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు. యోగా నిపుణుల మార్గదర్శకత్వంలో వివిధ రకాల యోగాసనాలు, ప్రాణాయామాలు నేర్పించారు. వాటిని ప్రత్యక్షంగా అభ్యసించే అవకాశం అందరికీ కలిగింది. ఈ సందర్భంగా యోగా ద్వారా పొందే శారీరక ఆరోగ్యం, మానసిక ప్రశాంతత, ఏకాగ్రత, ఒత్తిడి నుండి విముక్తి వంటి ప్రయోజనాలను కళాశాల విద్యార్థులకు అవగాహన కలిగించారు. కళాశాల ప్రాంగణంలో ఇంత ఉత్సాహభరితంగా నిర్వహించిన యోగా కార్యక్రమం ద్వారా ఆరోగ్యంపై శ్రద్ధ పెంచే ప్రయత్నం విజయవంతంగా సాగిందని, ఈ కార్యక్రమాన్ని ప్రతి సంవత్సరం పునరావృతం చేయాలని ప్రిన్సిపాల్ డా.సి.సరిత పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో శారీరక విద్యా అధికారి ప్రసాద్, ఎన్‌సిసి ప్రోగ్రాం అధికారి జైనూ బేగం, అధ్యాపకులు పుణ్యవతి, భార్గవి, రేష్మా, రామకృష్ణ, మురళి, సురేంద్ర, విభాగ సిబ్బంది సూర్యనారాయణ, రామకృష్ణ రెడ్డి, ఫణి, శివ, బాలాజీ, లోకేష్, మనోహర్, నారాయణ విద్యార్థులు విశేషంగా పాల్గొన్నారు.

## తాడిపత్రికి వెళ్లకుండా మరోసారి కేతిరెడ్డి పెద్దారెడ్డిని అడ్డుకున్న పోలీసులు

యల్లనూరు, జూన్ 14 ప్రభాతవార్త

తాడిపత్రికి వెళ్లకుండా మరోసారి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డిని పోలీసులు అడ్డుకున్నారు. తాడిపత్రికి వెళితే శాంతిభద్రతలకు ఇబ్బందులు తలెత్తుతాయన్న ఉద్దేశ్యంతో ఉదయాన్నే డిఎస్‌పి వెంకటేశ్వర్లు, సిఐ సత్యబాబు, ఎస్ఐ రామాంజనేయరెడ్డిలు ఆయనను అడ్డుకున్నారు. ఈ సందర్భంగా కేతిరెడ్డి పెద్దారెడ్డి మాట్లాడుతూ నాకు సొంత నివాసం వున్న తాడిపత్రికి వెళ్లడానికి పోలీసులు నిరాకరిస్తున్నారన్నారు. నేను తాడిపత్రికి వెళ్లడానికి హైకోర్టు అనుమతి వున్నా జిల్లా అధికారులు ఏదో ఒక కారణం చెబుతూ కాలయాపన చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఈశ్వర్‌రెడ్డి, పురుషోత్తంనాయుడు, బాలవెంకటరెడ్డి, కిరణ్‌కుమార్, రవి, భాస్కర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## మండల అభివృద్ధి సంక్షేమంపై చర్చకు సిద్ధం

- టిడిపి నాయకుడి సవాల్ స్వీకరిస్తున్నాం

- మండల కన్వీనర్ రవికుమార్ రెడ్డి



పత్రిక సమావేశంలో మాట్లాడుతున్న మండల కన్వీనర్

నల్లచెరువు జూన్ 14 ప్రభాత వార్త

గత వైఎస్సార్సీపీలో మండల అభివృద్ధిపై మండల ప్రజల సంక్షేమంలో చర్చకు వైఎస్ఆర్సిపి నాయకులు సిద్ధంగా ఉన్నామని మండల కన్వీనర్ రవికుమార్ రెడ్డి ఆయన నివాసంలో వైఎస్ఆర్సిపి నాయకులతో కలిసి శనివారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ఒక టిడిపి నాయకుడు కూటమి ప్రభుత్వం వారు వార్షికోత్సవం సందర్భంగా వైఎస్ఆర్సిపి ప్రభుత్వంలో జరిగిన మండల అభివృద్ధి పనులు పై వైఎస్ఆర్సిపి నాయకులు బహిరంగ చర్చకు రావాలని వైఎస్ఆర్సిపి శ్రేణులను రెచ్చగొట్టే ప్రయత్నం చేశారు టిడిపి నాయకుడి సవాళ్లను స్వీకరిస్తున్నామని ప్రజా వేదికపై మండల వైఎస్సార్ సీపీ మాయంతో చేపట్టిన అభివృద్ధి సంక్షేమ పథకాలపై చర్చకు తాము ఎప్పుడైనా సిద్ధంగా ఉంటామన్నారు మండలంలోని విద్యార్థులకు, నాయి బ్రాహ్మణులకు, చిరు వ్యాపారుల కు.చేనేత కార్మికులకు, రైతులను అడిగితే వైఎస్ఆర్సిపి అమలు చేసిన సంక్షేమ గురించి టిడిపి నాయకులకు వివరిస్తారన్నారు కూటమి ప్రభుత్వం ఏర్పడిన సంవత్సరం కావస్తున్న మండలంలో మీటర్ తారు రోడ్డు అయినా వేశారా అని ప్రశ్నించారు మాపై లేనిపోనివి మాట్లాడడం తగదని తెలిపారు. అదేవిధంగా ఓరువాయి గ్రామ దేవాలయ భూములను వైయస్సార్సీపి నేత ఆక్రమించారని బిజెపి నాయకులు విమర్శించడం నిజాలు తెలుసుకోకుండా మాట్లాడడం తగదని నరసింహారెడ్డి అనే పెద్ద మనిషిని అవమానించేలా పత్రికలు రచించడం మంచిది కాదన్నారు సర్వేనెంబర్ 828,లో 2.5 ఎకరాలు. భూమిని 1976, వ సంవత్సరంలో సొంటి మల్లె వెంకటరమణ, నుండి నాగమల్లి రెడ్డి కి,1976. లో సొంటి మళ్ళీ మల్లికార్జున రెడ్డికి, 1981 లో ఎద్దుల పాపిరెడ్డికి, 1984 లో బండ్రేవు నరసింహారెడ్డి, కొనుగోలు చేశారా అని ఐదు రిజిస్ట్రేషన్ల తర్వాత కొనుగోలు చేసిన వైఎస్ఆర్సిపి నేత అయిన నరసింహారెడ్డిని బాధ్యుడిని చేయడం ఏంటని ప్రశ్నించారు ఈ భూమి విషయంలో ఏదైనా తప్పు జరిగి ఉంటే ఇందులో నరసింహారెడ్డి కూడా బాధితుడే అన్నారు అధికారులు విచారణ జరిపి అతనికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు కార్యక్రమంలో కో కన్వీనర్ రఫీ, మాజీ మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ నాగభూషణ, సింగల్ విండో డైరెక్టర్ ఆదిమూర్తి, మాజీ టెంపుల్ చైర్మన్ ఆనంద రెడ్డి,సీనియర్ నాయకులు నరసింహారెడ్డి, పోరెడ్డి వెంకటరెడ్డి, హైటెక్ రమణ, పల్లె వెంకటరెడ్డి, ఆనందరెడ్డి, వెంకటరమణ,బాసు సాహెబ్, సలీం, ఇదాయతుల్లా, బషీర్, కల్లేపల్లి వేమయ్య, లక్ష్మీపతి,నరసింహారెడ్డి, తదితరులు పాల్గొన్నారు

## ఎమ్మెల్యే చొరవతో తాగునీటి బోరు




బోరును చూపుతున్న దృశ్యం

తనకల్లు, జూన్ 14 ప్రభాతవార్త

మండలంలోని ఏనుగుండుతండా గ్రామంలో తాగునీటికి ఇబ్బందులు పడుతుండడంతో కుర్ర నాగభూషణ ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ దృష్టికి సమస్యను తీసుకెళ్లారు. దీంతో వెంటనే స్పందించిన ఎమ్మెల్యే గ్రామంలో బోరు వేయించారు. ఆ బోరులో దాదాపు 3 ఇంచులుపైన నీరు సమృద్ధిగా పడడంతో గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. తాగునీటి సమస్యను పరిష్కరించిన ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్‌కు ఎప్పుడూ రుణపడి వుంటామని ఆయనకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు నాగభూషణ, ఈశ్వర్‌నాయక్ పాల్గొన్నారు.

## టీచర్ల సమస్యలు పరిష్కరించాలి




డిఇఓకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

అనంతపురం న్యూటౌన్, జూన్ 14 ప్రభాతవార్త

ప్రస్తుతం జరుగుతున్న బదిలీల సంధర్భంగా, ఉపాధ్యాయులకు ఏర్పడిన సమస్యలు తొలగించి అర్హులకు న్యాయం చేయాలని శనివారము కౌన్సిలింగ్ కేంద్రంలో డీఈఓకు పిఆర్‌టియు ఎపి అనంతపురం జిల్లా శాఖ పక్షాన వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా నాయకులు ఎన్.విష్ణువర్ధన్ రెడ్డి, టి.చంద్రశేఖర్ రెడ్డి, ఎన్.రజనీకాంత్ రెడ్డి మాట్లాడుతూ.... తెలుగు పండితులకు పదోన్నతులు వెంటనే కల్పించాలన్నారు. ప్రాధమికొన్నత పాఠశాలల్లో తెలుగు పండితులను నియమించాలని కోరారు. ప్రిఫరెన్షియల్ మరియు స్పౌజ్ కేటగిరీలో జరిగిన బదిలీల న్నింటిని పరిశీలించి ఏవైనా అవకతవకలకు పాల్పడినట్లు రుజువు అయితే నిబంధనల ప్రకారం గా బాధ్యులపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. లీగిలీ ఉపాధ్యాయులను ఈ విద్యా సంవత్సరంలో నియమించేటపుడు వారు ఎన్నికైన క్రమ సంఖ్య ప్రకారంగా మండలాలకు కేటాయించాలని కోరారు. వివిధ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య ప్రకారం మంజూరైన పోస్టు 30 కంటే తక్కువ సంఖ్యలో చూపించడం వలన అక్కడ ఉపాధ్యాయుల కొరత ఏర్పడుతుందని దీనిని నివారించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నేతలు పాల్గొన్నారు.

## నీట్‌లో ఆల్ ఇండియా ర్యాంక్ సాధించిన ముడియం కృష్ణ యాదవ్



కుమారున్ని అభినందిస్తున్న తల్లిదండ్రులు

అనంతపురం న్యూటౌన్, జూన్ 14 ప్రభాతవార్త

నీట్-2025 లో 519 మార్కులు సాధించి ఆల్ ఇండియా 33242, ఆల్ ఇండియా ఓబిసి 15442 ర్యాంకు సాధించిన ముడియం కృష్ణ యాదవ్ ఇతని తండ్రి ఎం.వెంకటసుబ్బయ్య మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల శోధన పల్లి సింగనమల మండలంలో, తల్లి పి.పద్మజ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల కాలాపురం పామిడి మండలంలో ఉపాధ్యాయులుగా పని చేస్తున్నారు. తమ కుమారుడు తను గెలుస్తూ... తల్లిదండ్రులుగా మమ్మల్ని గెలిపించాడని వారు కుమారునికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఇందుకు సహకరించిన మిత్రులు బంధువులు ఉపాధ్యాయులకు కృతజ్ఞతాభివందనాలు తెలియజేశారు.

## ఘనంగా మండల మహాసభ



సిపిఐ జెండాను ఆవిష్కరిస్తున్న దృశ్యం

తలుపుల, జూన్ 14, ప్రభాతవార్త

భారత కమ్యూనిస్టు పార్టీ మండల మహాసభలను దళిత హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు అంజన్న బాబు, మండల కార్యదర్శి ఈశ్వరయ్య, జిల్లా కౌన్సిల్ సభ్యుడు హసన్, ఎల్వి రమణ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా బస్టాండ్ వద్ద సిపిఐ జెండాను సిపిఐ జిల్లా కార్యదర్శి వేము యాదవ్ ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభకు ముఖ్య అతిథులుగా సిపిఐ జిల్లా ప్రధాన కార్యదర్శి వేమా యాదవ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కదిరప్ప పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీ పుట్టి 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా నూతనంగా ఎన్నికైన మండల కార్యదర్శి ఈశ్వరయ్య నూరు జెండాలు 100 మొక్కలు నాటే కార్యక్రమాన్ని తీసుకోవాలన్నారు. బడుగు బలహీన వర్గాల కోసం పుట్టిన పార్టీ సిపిఐ పార్టీ అన్నారు. సిపిఐ పార్టీ 1925 డిసెంబర్ 26వ తేదీన స్థాపించబడిందన్నారు. ముఖ్యంగా సిపిఐ పార్టీ భూమి కోసం, భుక్తి కోసం, పేద ప్రజల విముక్తి కోసం, చారిత్రాత్మక సాయుధ పోరాటాలు నిర్వహించిన పార్టీ భారత కమ్యూనిస్టు పార్టీ అని కొనియాడారు. దేశంలో నరేంద్ర మోడీ పాలన చాలా అరాచకంగా కులం యొక్క బేధాలను రెచ్చగొట్టే విధంగా పరిపాలిస్తోందన్నారు.. ఇటువంటి అరాచక పాలనకు వచ్చే ఎన్నికల్లో ప్రజలు ఖచ్చితంగా బుద్ధి చెప్పడం జరుగుతుందన్నారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో కదిరి డివిజన్ కార్యదర్శి పవన్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మధు, నూతనంగా ఎన్నికైన ఏఐటిసి మండల కార్యదర్శి వెంకటసుబ్బయ్య, ఇతర మండలాల కార్యదర్శులు, నూతన కమిటీ సభ్యులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

## విత్తన వేరుశనగ పంపిణీ



రైతులకు వేరుశనగ విత్తనాన్ని పంపిణీ చేస్తున్న నాయకులు

ఓబులదేవరచెరువు, జూన్ 14, ప్రభాతవార్త

మండల పరిధిలోని కొండకమర్ల రైతు సేవా కేంద్రంలో తహశీల్దార్ అనంతాచారి, టిడిపి నాయకులు రైతులకు శనివారం వేరుశనగ విత్తన కాయలు పంపిణీ చేశారు. టీడీపి నాయకులు జాకీర్ అహ్మద్, ఇడగుట్ట ఆంజనేయులు, జయచంద్ర రెడ్డి, బాలకృష్ణారెడ్డి తదితరులు మాట్లాడుతూ.... ఈ ప్రాంత రైతులు ప్రధానంగా వేరుశనగ పంట సాగు చేస్తారన్నారు. దీంతో విత్తనాల కోసం రైతులు ఎవరు ఇబ్బందులు పడకూడదని కూటమి ప్రభుత్వం అవసరమైన మేర వేరుశనగ విత్తనాన్ని సమకూర్చి అందించేందుకు సిద్ధంగా ఉందన్నారు. ఈ అవకాశాన్ని రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ కమిటీ ఉపాధ్యక్షుడు ఇమ్రాన్, నాయకులు సంఘాల శ్రీనివాస్, ఇర్షాద్, పంచాయతీ కార్యదర్శి మద్దిలేటి రెడ్డితోపాటు రైతు సేవా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

## సీఎం డిప్యూటీ సీఎం ఎమ్మెల్యే చిత్రపటాలకు పాలాభిషేకం



సీఎం డిప్యూటీ సీఎం ఎమ్మెల్యే చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న మహిళలు, టిడిపి నాయకులు.

అనంతపురం రూరల్, జూన్ 14 ప్రభాతవార్త

రాష్ట్ర ముఖ్యమంత్రి, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి రాష్ట్రంలోని తల్లులకు ఇచ్చిన మాట ప్రకారం ఇంటిలో ఎంతమందికి ఉంటే అంతమందికి తల్లికి వందనం వేయడం జరిగిందని వారికి కృతజ్ఞతలు తెలుపుతూ అనంత రూరల్ మండలం ఆకుతోటపల్లి గ్రామపంచాయతీలోని విద్యార్థుల తల్లులు, టిడిపి నాయకులు కార్యకర్తలు సీఎం నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎన్నికల సమయంలో రాష్ట్రంలోని ఎంతమంది విద్యార్థులు ఉన్న వారందరికీ మేము అధికారంలోకి వచ్చిన తర్వాత తల్లికి వందనం పథకం వర్తింపజేసి విద్యార్థుల తల్లి అకౌంట్లో అమోంట్ జమ చేయడం జరుగుతుందని ఆమె ఇవ్వడం జరిగిందని ఆయన ఇచ్చిన హామీ మేరకు ఆ పథకాన్ని నెరవేరుస్తూ ఇంటిలో ఎంత మంది విద్యార్థులు చదువుతున్న వారి అందరికీ తల్లికి వందనం పథకం ద్వారా విద్యార్థుల తల్లి అకౌంట్లో అమోంట్ జమ చేయడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. సీఎం నారా చంద్రబాబు నాయుడు చెప్పిన మాట నేర్పించిన సందర్భంగా సీఎం, డిప్యూటీ సీఎం, రాప్తాడు ఎమ్మెల్యే చిత్రపటానికి మా పిల్లలతో కలిసి పాలాభిషేకం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇంచార్జ్ రాగే మురళి,.అనిల్ చౌదరి ,స్టోర్ డీలర్ చంద్రశేఖర్ పూల నారాయణస్వామి, పూల నాగరాజు చట్టా సూర్యప్రకాష్, చంద్రమోహన్, పంచాయతీ పంచాయతీ కార్యదర్శి అశోక్ బాబు, టిడిపి నాయకులు,మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## భక్తులతో పోటెత్తిన ఆలూరుకోన



తాడిపత్రిరూరల్, జూన్ 14 ప్రభాతవార్త

తాడిపత్రి మండలంలోని ఆలూరుకోన శనివారం భక్తులతో పోటెత్తింది. ఉదయం అర్చకులు ఇంద్రకుమార్‌శర్మ శ్రీరంగనాథస్వామికి అభిషేకాలు నిర్వహించి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీరంగనాథస్వామిని వివిధ రకాల పుష్పాలు, తులసి దళాలతో ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం స్వామివారికి అర్చనలు, ఆకుపూజలు, తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అదేవిధంగా కోనలో వెలసిన శ్రీఆంజనేయస్వామి, శ్రీషిరిడిసాయిబాబా ఆలయాల్లో స్వామివారికి ప్రత్యేక పూజలు జరిపారు. పెద్దఎత్తున భక్తులు కోనకు తరలివచ్చి శ్రీదేవి, భూదేవి సమేతుడైన శ్రీరంగనాథస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలువురు భక్తులు తలనీలాలు సమర్పించి స్వామివారిని భక్తిశ్రద్ధలతో దర్శించుకుని తమ మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం భక్తులు నిత్య అన్నదాన సత్రంలో భోజనాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఇఒ రామాంజనేయులు, సిబ్బంది కాశీ పాల్గొన్నారు.

